
# సుజాతనగర్ కేంద్రంలో రూ.10 కోట్లతో కళాశాల, పబ్లిక్ స్కూల్





- కొత్తగూడెం కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తా.
- మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాం.
- నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి.
- రూ.5.33కోట్లతో 37 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన.
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం /

సుజాతనగర్ / అక్టోబర్ 6 / అక్షరం న్యూస్–: సుజాతనగర్ కేంద్రంలో రూ.10 కోట్ల వ్యయంతో త్వరలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల నిర్మాణాలు చేపట్టబోతున్నామని, ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చడాన్ని గర్వంగా భావిస్తున్నానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ పట్టణం కోమటిపల్లి, నిమ్మలగూడెం, నాయకులగూడెం, డేగలమడుగు, లెనిన్ నగర్, లక్ష్మీదేవిపల్లి, మంగపేట, సుజాతనగర్, నర్సింహసాగర్ పరిధిలోని 20, 21, 23 డివిజన్లలో మొత్తం రూ.5.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు, పార్కులు, ఇతర 37 అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా 20వ డివిజన్‌లో రూ.1.99 కోట్లతో 16 పనులకు, 21వ డివిజన్‌లో రూ.1.43 కోట్లతో 9 పనులకు, 23వ డివిజన్‌లో రూ.1.91 కోట్లతో చేపట్టనున్న 12 అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ..డివిజన్లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని, తద్వారా కొత్తగూడెం కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తానని స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న రహదారులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రజాధనం సద్వినియోగమయ్యేలా చూస్తూ, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నగర మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, మండే హనుమంతరావు, కమిషనర్ సుజాత, తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎస్ హెచ్ ఓ కళ్యాణి, కార్పొరేషన్ మేనేజర్ సత్యనారాయణ, డీఈ నరేష్, ఏఈ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ అర్షిత, విద్యుత్ ఏఈ కిషన్, వార్డు ఆఫీసర్లు రవికుమార్ విజయలక్ష్మి, మల్లిక, కృష్ణకుమారి, కార్పొరేటర్లు అనిత, శ్రావణి, స్థానిక నాయకులు భూక్య దస్రు, వాసిరెడ్డి మురళి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఈర్ల మల్లేష్, తాళ్లూరి పాపారావు, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, భాగం కృష్ణ, బానోత్ వెంకట్, మంగ్య, చందర్, హత్తిరామ్, కున్సోత్ శంకర్, భీమా, గుగులోత్ రవి, బండి రమేష్, దండు సురేష్, గద్దం రాజేందర్, లావుడియా గోపి తదితరులు పాల్గొన్నారు.



# పల్లెపల్లెకు ఆర్టీసీ ప్రయాణ సేవలను విస్తరిస్తాం..

- మారుమూల గ్రామాల రోడ్ల సమస్యను పరిష్కరించాం.
- ప్రజారవాణా ఆర్టీసీని ప్రజలు ఆదరించాలి.
- పాల్వంచ-దంతలబోర ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ జనం.



భద్రాద్రి కొత్తగూడెం /పాల్వంచ / అక్టోబర్ 6 / అక్షరం న్యూస్ –: ప్రతి పల్లెకు ప్రజారవాణా ఆర్టీసీ ప్రయాణ సేవలను అందుబాటులోకి తీసుకువస్తాం అని కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాల్వంచ–దంతలబోర ఆర్టీసీ బస్ సర్వీసులును లాంఛనంగా ప్రారంభించనున్నారు. తొలుత జండా ఊపి బస్ సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రధాన రోడ్ల సమస్యను పరిష్కరించామని అతి త్వరలో అంతర్గత రోడ్లు పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా రవాణా ఆర్టీసీని ప్రజలు ఆదరించాలని, ఆర్టీసీ బస్సులు సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, సంఘము సర్పంచ్, బానోతు రవి, నారాయణరావుపేట సర్పంచ్ బండి సరస్వతి, దంతలబోర్ సర్పంచ్, నాయకులు బానోతు రంజిత్, ప్రేమచంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, ఎష్ట.శ్రీను, సాయిలి ఎంకన్న, వెల్లంకి శివరావు, సత్యనారాయణ రాజు, మేక రాంబాబు, గ్రామ పెద్దలు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బస్సు, కాగడా గుర్తులకు ఓటెయ్యండి

- కార్మిక సంక్షేమానికి భరోసా ఈయూ, ఎన్ఎంయూ.
- ఎర్రజెండా అండతోనే సమస్యల పరిష్కారం.
- ఓటుతో కార్మిక ఐక్యతను చాటిచెప్పాలి.
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 6 / అక్షరం న్యూస్ – : టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బస్సు, కాగడా గుర్తులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి ఉత్సాహభరితంగా ప్రసంగించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని, ఎన్నో త్యాగాలు చేసి కార్మికులకు అనేక హక్కులు, విజయాలు సాధించిపెట్టిన ఘనత ఎర్రజెండాకే దక్కుతుందని కొనియాడారు. సంస్థను నమ్ముకుని నిరంతరం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులు, ఉద్యోగులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. రాబోయే 9వ తేదీన జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్లు కలిసి ఉమ్మడిగా బరిలోకి దిగుతున్నాయని తెలిపారు.

కార్మిక పక్షాన నిలిచే ఈ కూటమిని తిరుగులేని మెజారిటీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి క్లాజ్–3 కింద పోటీ చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ 'బస్సు' గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అలాగే ఖమ్మం రీజియన్ స్థాయిలో క్లాజ్–6 కింద బరిలో ఉన్న నేషనల్ మజ్దూర్ యూనియన్ 'కాగడా' గుర్తుపై ఓటు వేసి విజయదుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాడే శక్తులకు అండగా నిలవాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, నాయకులు కంచర్ల జమలయ్య, నేరెళ్ల రమేష్, ఈయూ, ఎన్ఎంయూ రాష్ట్ర, జిల్లా నాయకులూ ఎస్ బాబు, మౌలానా, థామస్ రెడ్డి, పిల్లి రమేష్, టివి ప్రసాద్, ఎస్ డి నజీర్, ఆర్ యెన్ సింగ్, హరివర్మ, జిసి శేఖర్, ఖాజామొహినుద్దీన్, జి రాజు, రేణుకాదేవి, రాధాదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



# 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి భారత్‌కు పోటీగా 6 దేశాలు



లూసాన్ (స్విట్జర్లాండ్): ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ గట్టిగా ప్రయత్నిస్తోంది. 2036 ఒలింపిక్స్ నిర్వహించేందుకు భారత్ సహా మొత్తం ఏడు దేశాలు అధికారికంగా ఆసక్తి కనబరిచాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) మంగళవారం వెల్లడించింది. ఈ ఏడు దేశాలు తమ గేమ్స్ ప్రాజెక్టులను నవంబర్‌లో ఐఓసీకి చెందిన ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ఎదుట ప్రదర్శించాలని ఆహ్వానించినట్లు పేర్కొంది. భారత్ పాటు జర్మనీ, హంగేరీ, ఖతార్, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, తుర్కియే పోటీలో ఉన్నాయి.భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ).. గుజరాత్ ప్రభుత్వం, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖల సమన్వయంతో అహ్మదాబాద్ నగరాన్ని వేదికగా ప్రతిపాదించింది. కాగా, నవంబర్‌లో జరిగే ప్రెజెంటేషన్లలో ప్రతిపాదిత వేదికల మాస్టర్ ప్లాన్, అథ్లెట్లకు కల్పించే సదుపాయాలు, నిధుల సేకరణ వ్యూహం, రాజకీయ–ప్రజా మద్దతు, నిర్వహణా సామర్థ్యం వంటి అంశాలను ఐఓసీ సమగ్రంగా పరిశీలిస్తుంది. 2029లో 2036 ఒలింపిక్స్ ఆతిథ్య నగర అధికారిక ప్రకటన చేయనుంది.

# భువీ వచ్చేశాడు.. నాలుగేండ్ల తర్వాత భారత జట్టులో రీఎంట్రీ

**న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు టీమ్ ప్రకటన**



న్యూఢిల్లీ: ఈ నెల 22 నుంచి జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటించే జట్టులో అతను చోటు దక్కించుకున్నాడు. 36 ఏండ్ల భువీ గత ఐపీఎల్‌లో 17 వికెట్లు తీసి ఆర్సీబీ వరుసగా రెండోసారి టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. పవర్‌ప్లేలో స్వింగ్, సీమ్ కదలికలతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టే సత్తా ఉన్న భువీని అజిత్ అగార్కర్ చీఫ్‌గా సెలెక్టర్‌గా ఉన్నంతకాలం ఎంపిక చేయడానికి మొగ్గు చూపలేదు. అయితే అగార్కర్ తప్పుకోవడంతో అతనికి మార్గం సుగమం అయింది.ఈ సిరీస్‌కు రెస్ట్ తీసుకుంటున్న పేస్ లీడర్ బుమ్రా లేని లోటును భువనేశ్వర్ తన అనుభవంతో పూడ్చనున్నాడు. భువీ 2022 నవంబర్‌లో భారత్ తరఫున తన చివరి మ్యాచ్ ఆడాడు. మరోవైపు గాయం కారణంగా ఆసియా క్రీడలకు దూరమైన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని జట్టులో తిరిగి చోటు దక్కించుకున్నాడు. ఈ సిరీస్‌లో ఐదు టీ20లు ఈ నెల 22, 24, 27, 30, నవంబర్ 1వ తేదీల్లో జరుగుతాయి.

జట్టు: శ్రేయస్ (కెప్టెన్), తిలక్, అభిషేక్, శాంసన్ (కీపర్), సూర్యవంశీ, ఇషాన్ (కీపర్), అక్షర్, దూబే, నితీశ్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్, భువనేశ్వర్, చక్రవర్తి, కుల్‌దీప్.

# ఉరుగ్వే చేతిలో భారత్ చిత్తు



కోల్‌కతా: మూడు రోజుల కిందట బ్రెజిల్ చేతిలో ఓడిన ఆతిథ్య జట్టు ఇప్పుడు మరో టాప్ టీమ్ ముందు తలవంచింది. 11వ నిమిషంలో లభించిన పెనాల్టీకి ఉరుగ్వే స్టార్ నూనెజ్ గోల్ కొట్టగా. 22వ నిమిషంలో అనిరుధ్ థాపా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి స్కోరును 1–1తో సమం చేశాడు.కానీ, 28వ నిమిషంలో ఉరుగ్వే ఆటగాడు అరెజో క్లోజ్ రేంజ్ నుంచి గోల్ చేసి ఉరుగ్వేను మళ్లీ ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత ఉరుములు, మెరుపుల కారణంగా మ్యాచ్ కొద్దిసేపు నిలిచిపోయినా తిరిగి మొదలైన తర్వాత ఉరుగ్వే ఆటగాళ్లు వరుస గోల్స్‌తో చెలరేగారు.

# ఓవరాల్ చాంప్ తెలంగాణ



హైదరాబాద్‌లో తొలిసారి జరిగిన ఈ టోర్నీలో 7 రాష్ట్రాల నుంచి 365 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. పాయింట్ల పట్టికలో తెలంగాణ 570 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, తమిళనాడు 505 పాయింట్లతో రెండో స్థానంలో రన్నరప్‌గా నిలిచింది. రాష్ట్రానికి చెందిన అద్రితీ శ్రా, షనాయ, అస్ఫా నూర్, అరీబా ఫాతిమా తదితరులు స్వర్ణాలు గెలిచారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609